## క్లుప్తంగా

### రైతు ఆత్మహత్యపై త్రీమెన్ కమిటీ విచారణ

**మార్కాపురం టౌన్:** మండలంలోని గజ్జలకొండ పంచాయతీ పరిధిలోని మాలపాటిపల్లె గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు గొలమారి కోటిరెడ్డి ఇంటి వద్ద త్రీమెన్ కమిటీ సభ్యులు గురువారం విచారణ చేశారు. ఈ కమిటీలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఎస్‌ఐ సుమన్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న కోటిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులతో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు, అప్పులు, పంటల సాగు తదితర వివరాలను తెలుసుకున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి పంపి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఆర్ఐ రమణ, వీఆర్‌ఓలు శివపార్వతి, రఫీ హాజరయ్యారు.

### రోడ్డుకు మరమ్మతులు

**ముండ్లమూరు:** మండలంలోని పులిపాడు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఎస్‌ఐ సంపత్‌కుమార్, స్థానిక సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి స్పందించారు. ప్రమాదాల జరిగేందుకు కారణాలు తెలుసుకునేందుకు బ్రిడ్జి వద్ద హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ విధులు నిర్వహించారు. అక్కడ రోడ్డు దెబ్బతినడంతో వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు గుర్తించారు. గురువారం బ్రిడ్జి వద్ద దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గోతుల వద్ద మట్టి పోయించారు.

### 30న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

**యద్దనపూడి:** మండలంలోని గన్నవరం–మార్టూరు దండుదారి మధ్యన వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం ఈ నెల 30వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళగిరి కమలాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, అభిషేకాలు, కుంకుమార్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందని, పరిసర గ్రామాల ప్రజలు స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

### ఘనంగా భూలోకమ్మ అమ్మవార్ల తిరునాళ్లు



అలంకరణలో అమ్మవారు

**మేదరమెట్ల:** కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మమ్మ, భూలోకమ్మ అమ్మవారి తిరునాళ్లు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొన్ని వందల ఏళ్ల క్రితం గ్రామదేవతలుగా కొలువైన అమ్మవార్ల తిరునాళ్లు వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున పాల పొంగళ్ల నివేదిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా తొమ్మిది రోజులపాటు కుంకుమ పూజ ధూప దీప నైవేద్యాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారని, అమ్మవార్ల పుట్టినిల్లయిన నూజెండ్లపల్లి గ్రామం నుంచి పసుపు కుంకుమతో మొదటి రోజు పూజ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు.

# పారదర్శకంగా సంక్షేమ ఫలాలు



బుక్‌లెట్‌లను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ఆస్పత్రిలో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు

**చీమకుర్తి:** అవినీతికి ఆస్కారం సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా అందిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గురువారం చీమకుర్తి మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ ద్వారా కూడా ప్రజలకు కావాల్సిన సేవలను పార్టీలకతీతంగా అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరం ప్రజలకు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రిగా కావాలని లబ్ధిదారులకు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల విలువ, ఏఏ పథకాలు వారి ఇంటిలోని లబ్ధిదారులకు అందాయో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించారు. తొలుత స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చైర్మన్ అయిన చల్లా అంకులు ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా పూల మాలలతో హారతులు పడుతూ ఘనంగా స్వాగతం పలికారు. కౌన్సిలర్లు సోమా శేషాద్రి, బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాలడుగు సుబ్బారావు, చిన్నపురెడ్డి మస్తాన్ రెడ్డి, మంచా హరికృష్ణ పాల్గొన్నారు.

#### నాణ్యమైన వైద్య సేవలు అందించండి

**చీమకుర్తి:** మండలంలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. గురువారం చీమకుర్తిలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో అభివృద్ధి, వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. చీమకుర్తి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యసేవలు, డాక్టర్ల వివరాలు, ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య వంటి పలు వివరాలపై సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, క్రిష్టిపాటి శేఖరరెడ్డి పాల్గొన్నారు.

# నగరవాసులకు అండగా ఉంటా



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు టౌన్:** నగరవాసులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కేశవస్వామిపేట జంక్షన్‌లో గురువారం నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైశాఖ శుద్ధ సప్తమి రోజు భగీరథస్వామి జయంతి వేడుకలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న నాయకులను బాలినేని అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పర సంఘ జిల్లా నాయకులు బాలినేనిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్ జడా వెంకటేష్, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, జిల్లా ఉప్పర సంఘం ఉపాధ్యక్షుడు జలశ్రీ మురళీకృష్ణ, ముద్రబోయిన ఆంజనేయులు, జలశ్రీ లక్ష్మణ్, దండూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జూటూరి హర్షవర్ధన్, దంపల వెంకట కృష్ణారావు, మిండోలు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం





విజయచిహ్నం చూపుతున్న ఎన్‌ఆర్‌ఐ కాలేజీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్ కాలేజీ యాజమాన్యం

**ఒంగోలు:** ఇంటర్ ఫలితాల్లో పలు కాలేజీల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్థానిక ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు డీన్ పి.సురేష్, ప్రిన్సిపాల్ టి.మురళీ కృష్ణ తెలిపారు. గురువారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో డీన్ సురేష్ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బి.అగస్త్య అనిరుధ్, సీహెచ్ రాఘవులు 982/1000 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో వి.హస్విక 981/1000 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఐ.మోహన వెంకట కృష్ణ 464/470, షేక్ షాకీరా, కె.సాయిరమ్య 461/470, జూనియర్ బైపీసీలో కె.యశస్వి 433/440 మార్కులు సాధించారన్నారు. ఆయా విద్యార్థులను అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 450కిపైగా మార్కులను 20 మంది, సీనియర్ ఎంపీసీలో 950కిపైగా మార్కులను 15 మంది సాధించారన్నారు.

**ఎస్‌ఆర్ కాలేజీ విద్యార్థుల విజయభేరి...**

తమ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయభేరి మోగించారని ఎస్‌ఆర్ కాలేజీ జోనల్ ఇన్‌చార్జి కంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక లంబాడీడొంకలోని కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థులు 464/470 మార్కులతో ఉత్తమ ఫలితాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అత్యధిక మార్కులతోపాటు 98 శాతం ఉత్తీర్ణత సాధించగలగడం గర్వంగా ఉందన్నారు. సిరిచందన 464, గంగోత్రి 463, వర్షిణి 462, సుప్రజ 462, లిఖిత నాగశ్రీ 461, సునందిని 460 మార్కులు సాధించారని పేర్కొంటూ విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

**శ్రీచైతన్య విజయకేతనం...**

తమ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య కాలేజీల డీన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.భువనేశ్వరి, ఓ నాగలిఖిత, జి.సుష్మ, సయ్యద్ అమీర్ బాషా 464/470 మార్కులు సాధించారన్నారు. 463 మార్కులు సాధించిన వారు ఐదుగురు, 462 మార్కులు సాధించిన వారు ఆరుగురు, 460కిపైగా మార్కులను 61 మంది సాధించారన్నారు. బైపీసీలో డి.పవన్‌నాయక్ 424/440 మార్కులు సాధించారని, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.లక్ష్మీసాయి తన్మయి 988/1000, పి.కౌషిక్, ఎస్‌వీ సునంద 986/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. 980కిపైగా 23 మంది సాధించారని, సీనియర్ బైపీసీలో ఓ.నాగసాయి అక్షిత్ 983/1000 మార్కులు సాధించడంతో పాటు 980కిపైగా 14 మంది సాధించినట్లు తెలిపారు.



జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 464/470 మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

# పొగాకుకు ఉత్తమ ధరలు

**మద్దిపాడు:** మండలంలోని వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకుకు మంచి ధరలు లభిస్తున్నాయని వేలం నిర్వహణాధికారి సత్యశ్రీనివాస్ అన్నారు. రైతులు బోర్డు అధికారులు తెలిపిన గ్రేడ్లు తెచ్చుకుంటే మంచి ధర లభించే విధంగా ప్రయత్నించవచ్చన్నారు. ప్రస్తుతం నల్లబొగులు తప్ప మిగిలిన లోగ్రేడ్లు పచ్చ, గట్టి బ్రౌన్‌లు, నెంబర్ పొగాకుకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి రేట్లు లభిస్తున్న దృష్ట్యా పొగాకు రైతులు ఆయా బేళ్లను తెచ్చుకోవాల్సిందిగా సూచించారు. సాఫ్ట్, హీట్, డ్యామేజీ బేళ్లను ఒకసారి ఇంటి వద్దనే సరిచూసుకుని తెచ్చుకోవాలన్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రానికి ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 8.34 మిలియన్ కేజీల పొగాకు పండించుకోవడానికి అనుమతులున్నాయని, రైతులు సుమారు 11 మిలియన్ కేజీల పంటను పండించారన్నారు. ఇప్పటి వరకూ 4.09 మిలియన్ కేజీల పొగాకును 46 రోజుల వేలంలో అమ్మకాలు జరిపినట్లు తెలిపారు. 15 రోజుల క్రితం గ్రేడు ధరకు ప్రస్తుతం మార్కెట్‌లో గ్రేడ్‌ను బట్టి 10 నుంచి 15 రూపాయల వరకు ధర అదనంగా లభిస్తుందన్నారు. కాబట్టి రైతులు వేలం కేంద్ర అధికారుల సూచనలు పాటించి బేళ్లు వేలం కేంద్రానికి తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం సరాసరి ధర 193.50 రూపాయలుగా ఉందని రైతులు అనుకున్న విధంగా సరాసరి ధర లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బ తిన్నా మార్కెట్ ధరలు బాగుండటంతో రైతులు ఆనందంగా నష్టాలు లేకుండా బయటపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోలు చేస్తున్న కంపెనీలలో పెద్దన్న గా వ్యవహరించే ఐటీసీ 60 శాతం పొగాకు కొనుగోలు చేస్తుండగా అలయన్స్ 10 శాతం, పీఎస్ఎస్ 9.5 శాతం , జీపీఐ 8.2 శాతం పొగాకును కొనుగోళ్లు చేస్తున్నాయి. కాగా ప్రతి కంపెనీకి పొగాకు అవసరం కావడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు.



పొగాకు అమ్మకాలు జరుపుతున్న ఏఎస్ సత్యశ్రీనివాస్

**889 పొగాకు బేళ్ల కొనుగోలు**

**ఒంగోలు రూరల్:** స్థానిక పొగాకు వేలం కేంద్రం –2లో గురువారం 889 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలం కేంద్రానికి 932 బేళ్లు రాగా, 11 నోబిడ్ అయ్యాయి. కేజీ గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.170, సరాసరి ధర రూ.196.20గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

# రూ.232 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

**చీమకుర్తి:** సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు రూ.232 కోట్లతో అభివృద్ధి పనులను నిర్వహించినట్లు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. గురువారం సంతనూతలపాడు మండల సమావేశం హాలులో చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, సంబంధిత విభాగాలకు చెందిన అధికారులతో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖలతో పాటు నియోజకవర్గంలోని 110 గ్రామాల్లో రూ.1000 కోట్లతో సంక్షేమ పథకాల ద్వారా ప్రజకు సేవలు అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు గ్రామ స్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### కాలువలోకి దూసుకెళ్లిన కారు

**కారంచేడు:** అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రొంపేరు కాలువలోకి దూసుకుపోయింది. ఈఘటన గురువారం కారంచేడు–చీరాల గ్రామాల మధ్యన చోటుచేసుకుంది. కారంచేడు ఎస్సై బీ శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన వ్యక్తులు చీరాలకు కారులో వస్తుండగా వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు–చీరాల గ్రామాల మధ్యన రొంపేరు కుడి కాలువపై నిర్మించిన పెదచప్టాలు వంతెన వద్ద మలుపులో అదుపుతప్పింది. కారు వేగంగా ఉండటంలో మలుపులో అదుపుతప్పిన కారు నేరుగా కాలువలోకి దూసుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాలువలో కొద్దిగా నీరు ఉండి బురదగా ఉంది. దీంతో కారు సగానికి పైగా బురదలో కూరుకుపోయింది. కాలువలో బురద ఎక్కువగా ఉండటంతో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు, పోలీసులు వచ్చి కారు అద్దాలు పగులగొట్టి కారులో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా బయటకు తీశారు. అనంతరం ఘటనకు సంబంధించి వివరాలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు.

### టైర్ పంక్చరై మినీ వ్యాన్ బోల్తా

**కొమరోలు:** టయర్ పంక్చర్ కావడంతో వేగంగా వెళ్తున్న మినీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటన మండలంలోని హసనాపురం సమీపంలో అమరావతి–అనంతపురం జాతీయ రహదారిపై గురువారం జరిగింది. బేస్తవారిపేట వైపు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న మినీ వ్యాన్ టయర్ పంక్చర్ కావడంతో రహదారికి అడ్డంగా బోల్తా పడింది. కొద్దిసేపు వాహనాలు నిలిచాయి. జేసీబీ సాయంతో బోల్తాపడిన మినీ వ్యాన్‌ను పక్కకు తొలగించారు. వాహన డ్రైవర్ రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

### మహిళలకు డ్రెస్ మేకింగ్‌పై శిక్షణ

**ముండ్లమూరు:** మండలంలోని ఈదరలో గురువారం మహిళలకు డ్రెస్ మేకింగ్ కోసం కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆశక్తి ఉన్న మహిళలకు మూడు నెలలు డ్రెస్ మేకింగ్‌లో ఇచ్చే శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యామ్ సునీల్, డీబీఆర్‌సీ జిల్లా కార్యదర్శి దార్ల కోటేశ్వరరావు, కో ఆర్డినేటర్ గోపనబోయిన వెంకటరావు సుశీల, రమేష్ పాల్గొన్నారు.

### ప్రసవాలతో పాటు ఆపరేషన్లు కూడా చేయాలి

**కారంచేడు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలతో పాటు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా నిర్వహించాల్సి ఉందని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా పరిశ్రమల అధికారి ఎన్ మదన్‌మోహన్‌శెట్టి అన్నారు. గురవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో సచివాలయం–1,2లతో పాటు, స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది విధులు, వారి పని తీరును అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఏఏ రకముల సేవలు అందుతున్నాయని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, డాక్టర్ షాలినీ, డాక్టర్ ప్రియ, హెచ్ఈ మీనాకుమారి, ఎల్‌టీ శంకర్, క్షీరవర్ధిని, మల్లేశ్వరి, నాగలక్ష్మి, జోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కోలాటంతో స్వాగతం పలుకుతున్న హైస్కూలు బాలికలు



కోలాటం ప్రదర్శన

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**చీమకుర్తి:** పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల హైస్కూలులో బుధవారం రాత్రి బాలికలు ప్రదర్శించిన కోలాటం, కూచిపూడి నృత్యంతో పాటు యోగాసనాలు, జానపద సాంఘిక నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. జిల్లాపరిషత్ బాలికల హైస్కూలు ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా హైస్కూలు ప్రాంగణంలో బాలికలచే ప్రదర్శించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది. యోగాసనాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల బాలికలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బురపరిచాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.జవహర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది బదరీనారాయణ, టీచర్స్ నల్లూరి వెంకటేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, ఎల్.నారాయణమ్మ, ఎస్ఎల్ఎస్ పార్వతి, పీ.గోవిందమ్మ, కె.నాగమణి, ఎల్.జ్యోతి, కె.పద్మ, డీవీ లక్ష్మి, పి.హోగ్లా, కే.ఆంజనేయులు, విజయ, సుస్మితి పాల్గొన్నారు.





కూచిపూడి నృత్య ప్రదర్శన

### పలు గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న'



మడనూరులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**కొత్తపట్నం:** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నం, రాజుపాలెం, మడనూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని, మరోసారి జగన్‌ను ఆశీర్వదించి సీఎంను చేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కేవలం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన పథకాలపై ఆధారపడి జీవిస్తున్న అనేక మంది నిరుపేదలు జగనన్నకు అండగా ఉంటామని నినదించారు. పథకాల లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీ నాయకులకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతామని చెప్పారు. అనంతరం ఇళ్ల యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను గోడలు, సెల్‌ఫోన్లపై అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మడనూరు అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, వాయల రోశయ్య, వాయల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.